# ప్లాస్టిక్ పువ్వు

మల్లాది వెంకట కృష్ణమూర్తి




కన్సల్టింగ్ రూమ్‌లోకి వస్తున్న ఆ యువతివంక ఆసక్తిగా చూశాను. ఇరవై లోపే. పంతొమ్మిదుండచ్చు అనుకున్నాను. సన్నటి నడుం ముందర ఏ మగాడ్నయినా ఆకట్టుకుంటుంది.

నా ముందున్న కుర్చీలో కూర్చుని నవ్వుతూ చూసింది నావంక. అమాయకమయిన కోల మొహం. గుండ్రటి బుగ్గలు. నల్లటి కళ్ళలో వింతవెలుగు. తడితో మెరిసే ఎర్రటి పెదవులు దోసకాయ గింజ ప్రమాణంలో నుదుట ఎర్రటి బొట్టు.

"చెప్పండి" అన్నాను.

"నేను మీకు వుదయం ఫోన్ చేశాను" వీణ మీటినట్లుగా మాట్లాడింది,

"ఓ. మీరేనా! మీ వారికి పెరాలసిస్ కదూ. చెప్పండి" అన్నాను నా మాటల్లో జాలి ఆమెకి దొరక్కుండా జాగ్రత్త పడుతూ. పాపం! ఇంత చిన్న వయసులోనే రోగిష్టి భర్త.

"మీరు మనసులో అనుకున్నది నిజమే. నాకు ఈ వయసులోనే రోగిష్టి భర్త దొరికారు. కారణాలు అనేకం. వాటిని మీ ముందు వుంచక్కరలేదనుకుంటాను"

"లేదు. కాని నేను పెరాలసిస్ కేసెస్ ఇంతదాకా తీసుకోలేదు. మీరు మదనపల్లిలో ప్రయత్నిస్తే బావుంటుందేమో."

"మా వారు అక్కడే ఉన్నారు. మీరు




నాకో చిన్న సహాయం చేస్తారనే ఆశతో వచ్చాను."

"ఏమిటది?"

"నా వయసు ఇరవై రెండు. ఆశ్చర్యపడకండి నిజమే, పద్దెనిమిదేళ్ళదానిలాగా వుంటాను. మా వారి వయసు నలభై రెండు ఇందాక కారణాలు వద్దనుకున్నా. ఆయన ఎడమచెయ్యి, నోరు పని చెయ్యవు. డిజానర్డ్ చెక్‌లా ఉంటారు."

నా ముఖంలో బాధ తాలూకు ఛాయని గుర్తించి చెప్పుకుపోయింది.

"నాకు విచారం లేదు. నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. ఆయన అలా రోగంతో చావటంకంటే ఒకేసారి చావటం మంచిది. మీరు సహాయం చేయాలి."

ఒక్క క్షణం నాకు అర్థం కాలేదు ఆమె మాటల తాత్పర్యం.

"మీరు డాక్టర్. మీరు చేయగలరు ఆ పని. కనీసం డెత్ సర్టిఫికేట్ అయినా ఇవ్వగలరు మీరు నేను కోరితే."

"ఏ పని?" కొద్దిగా కూడా తొట్రుపడలేదు ఆ అమ్మాయి.

"మీకు అర్థం అయింది."

"కాలేదు. మీ మనసులోది వివరంగా చెప్పండి."

"ఆయన ప్రతీ నిముషం చస్తూ, నన్నూ చంపుతున్నారు. అలా బ్రతికి చచ్చేకంటే, చచ్చి చావటం మేలు ఆయన."

"నాకసలేం అర్థం కావటం లేదు మీ ధోరణి. నాకు అర్థం చేసుకొనే శక్తి తక్కువ. ఏం చేయాలి నేను."

"లైఫ్ ఎక్స్‌పైర్ డ్రగ్స్ మీ దగ్గర చాలా వుంటాయి అవతల పారేసే బదులు సిరంజిలోకి ఎక్కించి, ఆయన వంట్లోకి ఎక్కించండి."

"గుడ్‌గాడ్. అలాంటి కాలపరిమితి దాటిన మందులు విషంకన్నా ప్రమాదం."

"నేను ఎం. బి. బి. ఎస్. సెకండియర్ దాకా చదివి ఆపేశాను."

నా ముఖం ఎర్రబడింది. పిడికిలి బిగుసుకుంది. "నన్ను హత్య చేయమంటున్నారు" అన్నాను.

వీణ సున్నితంగా మీటినట్లు నవ్వింది.

"మీకు అర్థం చేసుకునే శక్తి తక్కువన్నారు? కాదు. వెల్ మీకు బ్లాంక్ చెక్ ఇస్తాను సంతకం పెట్టి."

"బ్లాంక్ చెక్ నన్నాకర్షించదు" కఠినంగా అన్నాను.

"నలభై దాటిపోయింది అప్పుడే మీకు. ఇంకేం ఆకర్షిస్తాయి!" అన్నది జారిపోని పైట సర్దుకుని, ఒళ్ళు విరుచుకుంటూ.

"ప్లీజ్ గెటౌట్."

"మీకు మర్యాద తెలియదు. వెళ్తున్నాను. అయితే మీ గురించి నేను తప్పుగా విన్నాను సారీ."

లేచింది. నా కళ్ళ ఎదురుగా అయిదడుగుల నాలు గంగుళాల ఎత్తున అందం రాశిగా పోసివుంది. కాని నేను ముందర ఆమెలో చూసిన గులాబులు కనబడలేదు ఈసారి. ప్లాస్టిక్ పువ్వులు కనబడుతున్నాయి ఇప్పుడు. వాసనలేని ప్లాస్టిక్ పువ్వులు.

"అయితే మీరు నేను కోరింది చేయరా?" ఆఖరిసారిగా అడిగింది.

"మనుషులలో నల్లటివాళ్ళు తెల్లవాళ్ళ కన్నా మంచివాళ్ళు అని ఓ సిద్ధాంతం గురించి విన్నాను. ఇప్పుడు స్వయంగా తెల్సుకున్నాను. తెల్లవాళ్ళు బయటకి మాత్రమే అందంగా వుంటారు."

"హూ" అని విసవిస నడిచి వెళ్ళిపోయింది ఆ విసురు నడకలో అందం చూస్తే, ఇరవై ఏళ్ళ క్రితం తప్పక వప్పుకునే వుండేవాణ్ణేమో అనిపించింది కళ్ళజోడు సర్దుకుంటూంటే.

* * *

ఆమె మరి కనబడలేదు నాకు. పేరు తెలియదు. ఊరు తెలియదు. ఆమె గురించి ఏమీ తెలియదు. చాలారోజులు నాకు ఆమె గుర్తుంది. క్రమంగా మర్చిపోయాను.

ఇన్నాళ్ళకి మళ్ళీ ఇప్పుడే చూస్తున్నాను. గిండీ రేస్ కోర్స్‌లో బుక్స్ కౌంటర్ ముందు నిలబడి టిక్కెట్లు కొంటోంది. పక్కనే ఓ అందమయిన యువకుడు.

"ఏమిటలా చూస్తున్నావ్? నాకు తెలుసామె" నా మిత్రుడు నవ్వుతూ చెప్పాడు.

"ఎలా తెలుసు?" అడిగాను.

"ఆమె భర్త నా క్లయింట్ లక్షాధికారి కేరళలో కొబ్బరితోటలున్నాయి వాళ్ళకి."

"ఆమెని పదేళ్ళ క్రితం చూశాను."

"ముప్ఫైమూడు ఇప్పుడు ఆమెకి. కాని ఎవరూ నమ్మరు అంత వయసుంటుందని, ఇరవై రెండేళ్ళ అమ్మాయిలా కనబడుతుంది గమ్మత్తు."

"ఆ అమ్మాయి భర్త?"

"పాపం పదేళ్ళ క్రితం ఓ రోజు లారీ వచ్చి గుద్దేసింది రోడ్డు ప్రక్కన నడుస్తున్న ఆయన్ని. ఆ లారీ డ్రయివర్ ఇంతదాకా పత్తాలేడు. ఆ సంఘటన జరగడానికి ఓ నెల ముందే విల్లురాశాడు ఆయన. నేనే డ్రాఫ్ట్ చేశాను ఆ విల్లుని."

"బ్లాంక్ చెక్కు చాలా మందిని ఆకర్షిస్తాయి." గొణిగాను.